క్లుప్తంగా

ఆర్‌టీఐ చట్టంపై అవగాహన

దాచేపల్లి: ఆర్‌టీఐ యాక్ట్‌పై ప్రతిఒక్కరు అవగాహన కలిగిఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి డి.పాపకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌టీఐ చట్టంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీఓ శోభారాణి ప్రారంభించారు. ఏఓ పాపకుమారి మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టే పనులు, నిధుల ఖర్చుల వివరాలను ఈ చట్టం ద్వారా సేకరించే హక్కు ప్రతి పౌరుడిగా ఉందని, దీనిద్వారా సేకరించిన సమాచారంలో లోపాలు ఉంటే ఉన్నతాధికారులు, సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ యాక్ట్ ద్వారా సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి నిర్ణీత గడువులో సమాచారం అందిస్తారని వివరించారు. రైతులు, స్థానికులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంలోని ఓ నివాసగృహంలో బుధవారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ సంభవించింది. గుదె జానకిరామయ్య అపార్ట్‌మెంట్‌లోని మూడవ అంతస్తులో జరిగిన ఈ ప్రమాదంలో నివాసంలోని ఫ్రిజ్, సోఫా సెట్‌తో పాలుగా ఇతర గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. స్థానికులు ఆంధ్రాసిమెంట్స్ అధికారులకు సమాచారం అందించటంతో హుటాహుటిన ఫైరింజన్‌ను సంఘటన స్థలానికి పంపారు. సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పిడుగురాళ్ల నుంచి కూడా అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలంకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. సీఐ గుత్తి వెంకట్రావ్, ఎస్‌ఐ దాసరి శివనాగరాజు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య సంఘటన స్థలంకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సుమారుగా రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు స్థానికులు చెప్పారు. సంఘటన జరిగిన సమయంలో ఇంట్లోని వారందరూ ఊరికి వెళ్లటంతో పెనుప్రమాదం తప్పింది.

లక్ష్యాలను చేరుకునేలా సమష్టిగా పనిచేయాలి




మాచర్ల: మండలంలోని ప్రతి గ్రామంలో ఆరు వేల మందికి 100 రోజుల పనిదినాలు కల్పించేందుకు ప్రతి ఒక్క ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది సమష్టిగా పనిచేయాలని మండల ఉపాధి హామీ అధికారి టి.నాగ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని మహాత్మాగాంధీ ఉపాధి హామీ మండల కార్యాలయంలో ఆయన టీఏలు, ఎఫ్ఏలతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. శనివారం లోపు 16 గ్రామ పంచాయతీలలో 6వేల మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. 50 ఎకరాలలో కందకాలను తవ్వించేందుకు 100 ఎకరాల్లో పండ్లతోట పెంపకాలకు చర్యలు తీసుకునేలా లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామ గ్రామానా కూలీలను చైతన్య పరచి లక్ష్యాలు సాధించేలా పనిచేయాలన్నారు. టీఏలు లూర్థరస్, కె.కిశోర్, సీఓలు శ్రీనివాస్, లక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సేవలు అభినందనీయం

మాచర్ల: వరద బాధితులను ఆదుకునేందుకు డ్వాక్రా మహిళలు, సీఓలు, ఆర్పీలు, మెప్మా ప్రాజెక్టు ఆర్థిక సాయం అందించటంతో పాటు మూడు రోజుల పాటు వారికి సేవలందించడం అభినందనీయమని మెప్మా ప్రాజెక్టు స్థానిక మేనేజర్ ఎం.సుబ్బారావు పేర్కొన్నారు. పురపాలక సంఘ ప్రాంగణంలో ఉన్న మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదే విధంగా డ్వాక్రా సంఘాలు ముందుకొచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సీఓలు రాజశేఖర్, అంజలి, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



కోటమ్మ (ఫైల్)

పిడుగురాళ్ల: శతాధిక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ... పట్టణంలోని మూడవ వార్డులోని మాజీ కౌన్సిలర్ కొక్కెర కొండలు నాయనమ్మ కొక్కెర కోటమ్మ(101)బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమెకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు కాగా 9 మంది మనవళ్లు, పది మంది మనవరాళ్లు ఉన్నారు. కోటమ్మ మృతదేహాన్ని జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు గండికోట వెంకటేశ్వర్లు, రాంబాబు, లింగయ్య, జక్కుల వీరస్వామి, కొండలు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సందడిగా గణపతి నిమజ్జనాలు



మాచర్లలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



రామాటాకీస్‌కు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి ఆట బొమ్మలతో అలంకరణ

- మండపాల్లో వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు
- భారీ ఊరేగింపులతో నిమజ్జనాలు

మాచర్ల: పట్టణంలో వివిధ వార్డులలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసిన నిమజ్జన కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు వినాయకుని విగ్రహాలను ట్రాక్టర్లు, మినీ వ్యాన్లపై ఊరేగిస్తూ టపాసులు కాలుస్తూ జై జై గణేశా అంటూ సందడి చేశారు. పాతూరు, రోప్‌వే కాలనీ, వడ్డెర బజారు, రింగు రోడ్డు సెంటర్, కేసీపీకి వెళ్లే రహదారిలోని 20 విగ్రహాలను డీజేలతో గులాంలు చల్లుకుంటూ నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని రామాటాకీస్‌కు వెళ్లే రహదారిలో అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆట బొమ్మలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో గణేశ్ నిమజ్జనాలు...

మాచవరం: వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాలను 5వ రోజు భక్తిశ్రద్ధలతో గోవిందాపురం వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ముందుగా ఆయా గ్రామాల్లో వినాయకుని లడ్డుల వేలం నిర్వహించి, అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. యువకులు, మహిళలు ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. గోవిందాపురం బల్లకట్టు రేవు వద్ద తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: పట్టణంలోని ఏడుకొట్ల సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయాన్నే భక్తులు స్వామికి పూజలు నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 73వ వార్షికోత్సవం కావటంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. 27 కేజీలు లడ్డూను రూ. 70 వేలకు జుజ్జూరి హరిబృందం సభ్యులు కైవసం చేసుకున్నారు.



పిడుగురాళ్ల ఏడుకొట్ల సెంటర్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం



వినాయక లడ్డూను కైవసం చేసుకున్న జుజ్జూరి హరి బృంద సభ్యులు



గోవిందాపురం వద్ద బల్లకటు ద్వారా కృష్ణానదిలో గణేశుని నిమజ్జనం

మునగలో అంతర పంటలతో లాభం



గుత్తికొండలో మునగలో అంతర పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పిడుగురాళ్ల: మునగ పంటలో అంతర పంటలు వేయడం వలన లాభాలను పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి అన్నారు. మండలంలోని గుత్తికొండ గ్రామంలో మునగ పంటను పరిశీలించి అనంతరం అందులో అంతర పంటల వలన వచ్చే లాభాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మునగను ప్రధాన పంటగా వేసి అందులతో బెండ, టమాటా, మిర్చి, చిక్కుడు, ఆనప, కాకర, బీర, సొర, పొట్లకాయ, వంగ, అరటి, సజ్జ వంటివి వేసుకోవటం మంచిదని తెలిపారు. ఎకరం పొలంలో ప్రధాన పంటతోపాటు 12 రకాల పంటలను వేసుకోవచ్చునని తెలిపారు. దీని వలన చీడ, పీడలు, తెగుళ్లను నివారించవచ్చని పేర్కొన్నారు. భూమిని 365 రోజులు పంటలతో కప్పి ఉంచడం ద్వారా భూమిలో నీటిని నిలవ చేసుకొనే గుణం పెరుగుతుందని, నీటి ఎద్దడిని తట్టుకోగలుగుతుందని తెలిపారు. యూనిట్ ఇన్‌ఛార్జి రేణుకాదేవి, ఎస్‌ఎఫ్‌ఏ అప్పలరాజు, మాస్టర్ ట్రైనర్ బాజిబాబు, మోడల్ మేకర్ హసీనా, ఐసీఆర్‌పీ పురుషోత్తం, అనిల్, రైతులు పాల్గొన్నారు.

17న విశ్వకర్మ జయంతి మహోత్సవం

మాచర్ల: పట్టణంలో ఈ నెల 17వ తేదీన విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు కటకం నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి మోహన్‌బాబులు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ముందుగా గణపతి పూజ, ఉదయం నుంచి హోమం, అనేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సాయంత్రం 5గంటలకు స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పలువురు సంఘ పెద్దలు పాల్గొంటారన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విశ్వకర్మ ఆశీస్సులు పొందాలని కోరారు. జ్యూయలర్స్ బాబు, కూరెళ్ళ వీరబ్రహ్మాచారి, శ్యాంసుందరాచారి, సిద్దయ్య చారి, ధవళేశ్వరపు రాంబాబు, చెన్నుపాటి రాంబాబు పాల్గొన్నారు.

దేశ సంపదను దోచేస్తున్న కార్పొరేట్లు, మతోన్మాదులు

సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య, పక్కన నాయకులు

సత్తెనపల్లి: ప్రజల సంపదను దేశంలో కార్పొరేట్లు, మతోన్మాదులు దోచేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. పట్టణంలోని ముజిఫర్ అహమ్మద్ చౌక్ వద్ద బుధవారం జరిగిన సీపీఎం 16వ వార్డు శాఖ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ముజఫర్ అహమ్మద్ చౌక్ వద్ద సీపీఎం జెండాను పార్టీ నేత యర్రంశెట్టి వెంకటరావు ఆవిష్కరించారు. పార్టీ నేత షేక్ సైదావలి అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల మధ్య మతోన్మాద చిచ్చు పెట్టి ఐక్యంగా ఉండాల్సిన ప్రజలను మతాల పేరుతో చీల్చి అధికారం కొనసాగిస్తుందన్నారు. దీనికి భిన్నంగా బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేక శక్తులన్నింటినీ ఏకం చేసేందుకు సీపీఎం నిర్విరామంగా కృషి చేసిందన్నారు. ఫలితంగానే గత పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయిందన్నారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడారు. ఈ మహాసభలో శాఖ కార్యదర్శి ఎం.హరిపోతురాజు గత మూడు సంవత్సరాల్లో నిర్వహించిన కార్యకలాపాల కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. అనంతరం మహాసభ నూతన కార్యదర్శిగా ఎం.హరిపోతు రాజును తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ మహాసభలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు జడ రాజ్ కుమార్ పరిశీలకులుగా పాల్గొన్నారు. శాఖ సభ్యులు సెగ్గెం వెంకటేశ్వరరావు, మొగిలిపాలెపు రమాకుమారి,భూతం భాస్కరరావు, గుంటూరు వేమయ్య, షేక్ జానీ బాష పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ బోర్డు విరగ్గొటిన దుండగులు



సాక్షి టాస్క్‌ఫోర్స్: మండలంలోని కేసానపల్లి యాదవ బజార్‌లో వైఎస్సార్ సీపీకి చెందిన ఎలక్ట్రికల్ ఫ్లెక్సీ బోర్డును మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విరగగొట్టారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఉల్లేరు హనుమంతరావు ఇంటివద్ద ఈ ఫ్లెక్సీని ఏడాదిక్రితం ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీని కొంతమంది వ్యక్తులు విరగగొట్టి కిందపడవేశారు. విరగగొట్టి పడవేసిన ఫ్లెక్సీ బోర్డును వైఎస్సార్ సీపీ గ్రామ, మండల నాయకులు బుధవారం పరిశీలించారు.

స.హ.చట్టంపై అవగాహన పెంచుకోవాలి



గుండ్లపల్లిలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ కె.దేవదాసు

నకరికల్లు: ప్రభుత్వంలోని అన్నిశాఖలకు సంబంధించిన సమాచారాన్ని నిర్ణీత రుసుము చెల్లించి రాతపూర్వకమైన సమాచారం పొందవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును గ్రామ సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రతి రైతు అవగాహన పెంచుకోవాలన్నారు. సమాచారం కోసం ప్రభుత్వ శాఖలకు దరఖాస్తు చేసుకొని సమాచారం పొందే విధానంపై అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ తరఫున చేపడుతున్న ఈ-పంట నమోదు రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను మూలాధారమని సూచించారు. ఈ-పంట నమోదు పూర్తయ్యాక ఫార్మర్ ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. గ్రామంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది ద్వారా చేపడుతున్న పంట నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. ఈనెల 15వ తేదీలోగా పంటన మోదు ప్రక్రియ పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఎం.సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన 'బుంగా'

పిడుగురాళ్ల: బుంగా నాగేశ్వరరావు సీపీఎం పోరాటాల్లో అలుపెరగని పోరాటాలు చేశారని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మృతిచెందిన సీపీఎం నాయకుడు బుంగా నాగేశ్వరరావు మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి గోపాలరావుతో కలిసి ఆయన సందర్శించి, నివాళులర్పించారు. తెలకపల్లి శ్రీనివాసరావు, షేక్ బాబు, గుర్రం కొండమ్మ, షేక్ హుస్సేన్, బత్తుల వెంకటేశ్వర్లు, దేవుళ్ల భూలక్ష్మీ తదితరులు ఉన్నారు.

అసైన్డ్ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు

రాజుపాలెం: మండలంలోని బీరవల్లిపాయ సమీపంలోని అసైన్డ్ భూమిలో అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టితవ్వకాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా పెద్ద పెద్ద పొక్లెయిన్‌లు పెట్టి వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా వేరే గ్రామాలకు మట్టిని తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ దుర్గేష్‌రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తహసీల్దారు రాకను గమనించిన అక్రమార్కులు ట్రాక్టర్లను, టిప్పర్లను వేరే మార్గానికి తరలించారు. తహసీల్దార్ క్వారీ వద్దకు వెళ్లే సరికి పొక్లెయిన్ ఒక్కటే ఉండడంతో దాన్ని సీజ్‌చేసి స్థానిక ఎస్‌ఐ వేణుగోపాల్‌కు ఫోన్ చేసి పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, ఇలాంటి అక్రమ తవ్వకాలను అనుమతించేది లేదని అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ట్రాక్టర్లు, టిప్పర్లు విపరీతంగా తిరగడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, సీసీ రోడ్లు పాడైపోతున్నాయని చౌటపాపాయపాలెం పులిచింతల నిర్వాసితులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

ఘనంగా పేరెంట్స్ డే



మాచర్ల: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పేరెంట్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రాండ్ పేరెంట్స్ అధిక సంఖ్యలో పాల్గొని వారి వారి అభిప్రాయాలను తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హనుమంతరావు, డైరెక్టర్ డాక్టర్ శివ మాట్లాడుతూ తల్లిదండ్రులు చిన్నారులను చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో పెంచాలన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పేరెంట్స్ డే సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రైతులను చైతన్యం చేయండి

డీడీఏ ఎం.శివకుమారి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీడీఏ ఎం.శివకుమారి, వ్యవసాయ శాఖాధికారులు

మాచర్ల: వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో వ్యవసాయంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించటంతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రణాళిక ప్రకారం రైతులను చైతన్య పర్చేందుకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ (డీడీఏ) మద్దినేని శివకుమారి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఐదు మండలాల వ్యవసాయ శాఖాధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. వరి, కంది పంటలలో మేలైన వ్యవసాయ, సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి ఆమె శిక్షణ కార్యక్రమంలో వివరించారు. వ్యవసాయ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సైదానాయక్ మాట్లాడుతూ పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి టి.ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు వి.జగదీష్‌రెడ్డి, వ్యవసాయాధికారులు కట్టా లక్ష్మారెడ్డి, వై.పుల్లారెడ్డి, వై.అమీర్‌రెడ్డి, వి.బ్రహ్మారెడ్డి, ఎం.సంధ్యారాణి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

నెంబరు ప్లేట్ల పేరుతో డబ్బులడిగితే ఇవ్వొద్దు

- విద్యుత్ శాఖ ఎటువంటి నెంబరు ప్లేట్లు బిగించడం లేదు
- వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి
- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబు



మాచర్ల: మాచర్ల విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలో 11 మండలాల్లో ఎక్కడా నెంబర్ ప్లేట్లను ఇళ్లకు విద్యుత్ శాఖ ఏర్పాటు చేయటం లేదనే విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబు తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అనుమానితులు విద్యుత్ వినియోగదారుల సర్వీసు నెంబరు నేమ్ ప్లేట్లను బిగించి వినియోగదారుల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. నెంబర్ ప్లేటు పెట్టిన తరువాత డబ్బులివ్వాలని బెదిరిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఆ విధంగా ఎవరికీ ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదన్నారు. విద్యుత్ వినియోగదారులు అక్రమ వసూళ్ల చేసేవారిపై పోలీసు శాఖకు, విద్యుత్ శాఖకు తెలిపితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న యూటీఎఫ్ బృందం



కొర్లయ్య దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మాచవరం: మండలంలోని శ్రీరుక్మిణీపురం గ్రామంలోని ఎంపీయూపీస్కూల్‌లో పనిచేస్తున్న ఎస్.సునీత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న సందర్భంగా యూటీఎఫ్ సభ్యులు ఆమెకు అభినందనలు తెలుపుతూ దుశ్శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసి ఆదర్శంగా నిలవాలని అన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. విజయసారధి, జిల్లా, మండల యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

మాచర్ల: వెనుకబడిన మాచర్ల మండలంలో అనేక ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసి ప్రతి విద్యార్థికి ఉత్తమ బోధన చేస్తూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న కొర్లయ్య అభినందనీయుడని ఎంఈఓ అల్లి సురేష్ అన్నారు. బుధవారం వీరభద్రాపురం, నెహ్రూనగర్ మండల పరిషత్ పాఠశాలలో సిహెచ్ కొర్లయ్య దంపతులకు ఎంఈఓ అల్లి సురేష్, హెచ్‌ఎం గాదె కిరీటిరెడ్డిలు సత్కరించి అభినందించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్ సకీనా, షేక్ రెహానా, ఆదిలక్ష్మి, మేరి, కేశవరెడ్డి, ఏడుకొండలు, నాగరాజు, సుజాత, పద్మావతి పాల్గొన్నారు.

యూ డైస్ ప్లస్‌లో పాఠశాలల సమగ్ర సమాచారం



హెచ్‌ఎంల శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు, పక్కన ఎంఈఓ-2 రాఘవేంద్రరావు

సత్తెనపల్లి: పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఈనెల 27వ తేదీ లోపు యూ డైస్ ప్లస్‌లో నింపాలని సత్తెనపల్లి ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం అన్ని యాజమాన్య పాఠశాలలకు సంబంధించిన హెచ్‌ఎంలతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలల పూర్తి సమాచారం తప్పులు లేకుండా ఈ నెల 27వ తేదీ లోపు యుడైస్ ప్లస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో నింపాలన్నారు. ఎంఈఓ-2 ఎ.రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఈసారి యు డైస్ ప్లస్‌లో ఎడిట్ ఆప్షన్ లేదని, ఏమైనా తప్పుడు సమాచారం పంపితే హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌ఎంటీలు టి.నరేంద్ర, శ్రీకాంత్, ప్రసాద్, ఇందిరా, మల్లేశ్వరి, నీరజ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ వై.ప్రశాంతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఈవీ లక్ష్మి పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు



జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష చేస్తున్న న్యాయమూర్తి నాగవెంకట శ్రీనివాసరావు

సత్తెనపల్లి: రాజీ పడదగిన కేసులు అన్నీ ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ ఆదాలత్‌లో పరిష్కారం అయ్యేలా చూడాలని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), సత్తెనపల్లి మండల న్యాయ సేవ అధికార కమిటీ చైర్మన్ సిహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని పట్టణంలోని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు హాల్లో సత్తెనపల్లిలోని నాలుగు న్యాయస్థానాల పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయమూర్తి నాగ వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజీమార్గం రాజమార్గం అన్నారు. ప్రజల్లో కక్షలు, కార్పణ్యాలు పెరగకుండా కేసులు తొలి దశలోనే పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సమీక్ష సమావేశంలో ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, సత్తెనపల్లి ఒకటవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శిని, పలు పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, కోర్టు కానిస్టేబుల్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

బెల్లంకొండ: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ బెల్లంకొండ మండల నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు పల్నాడు జిల్లా అధ్యక్షుడు సాంబశివరావు తెలిపారు. బుధవారం మండలంలోని పాపాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ నరేష్, ప్రధాన కార్యదర్శిగా కూరపాటి వెంకటేశ్వరరాజు, ఆర్థిక కార్యదర్శిగా బీవీ పద్మావతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలను అందజేశామని తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.